# అద్దం అబద్ధమాడదు

—వసుంధర

నవ్వుల కథల పోటీలో మూడో

చాలా అందమైన ఆడపిల్లని పెళ్ళి చేసుకోవాలని నా కోరిక. నా మరదలు గొప్ప అందగత్తె. పెళ్ళి చేసుకోమని అడిగితే, "అద్దంలో నీ ముఖం చూసుకో" అంది.

ఆ దెబ్బకు ఢీలా పడిపోవలసిందే కానీ నా మరదలి పెళ్ళి నన్ను రక్షించింది. అది చేసుకున్నవాడు ఆదిమానవుడిలా ఉంటాడు. అదేమని అడిగితే, "అందమైన కళ్ళతో చూడు" అంది — నా కళ్ళు కురూపివని నిర్ణయిస్తూ.

ఆ ఆదిమానవుడికి బ్యాంకులో పది లక్షలున్నాయి. నెలకు పాతిక వేలొచ్చే ఉద్యోగం. కంపెనీ యిచ్చిన కారు, బంగళా! ఇవన్నీ కలిసి వాడి కంపెనీకి అందమైన భార్యనిచ్చాయి.

అందమైన భార్య కోసం కష్టపడి చదివాను. కాంపిటేటివ్ పరీక్షలు రాశాను. ఓ ఆఫీసరు ఉద్యోగం సంపాదించాను. సంబంధాలు వెంటబడ్డాయి. నాన్న నాకు చాలామంది పెళ్ళికూతుళ్ళనే చూపించాడు. అది నాకు అగ్లీ కాంటెస్టులా తోచింది. ఏళ్ళు గడుస్తున్నాయి.

డబ్బుకోసం నాన్న అలాంటి సంబంధాలు చూస్తున్నాడని తెలిసి అమ్మదగ్గర చిరాకు పడ్డాను. అందం కొరుక్కు తింటామా అంది అమ్మ. కొరుక్కు తింటామో ఏమో — పత్రికల అట్టల మీదా, వెండి తెరమీదా, ఫ్యాషన్ షో వేదికమీదా అందానిదే కదా స్థానం!

మా ఆఫీసులోనే ఇద్దరమ్మాయిలున్నారు. సినీ తారల కంటే బాగుంటారు. వాళ్ళిద్దరిలో ఎవరినైనా పెళ్ళి చేసుకోవచ్చు. కానీ ఒకరిది భాష వేరు. ఇంకొకరిది కులం వేరు. మా నాన్న అయితే శాఖ వేరైనా ఒప్పుకోడు.

ఇలాంటి పరిస్థితుల్లో ఓ పెళ్ళిలో లతను చూశాను. నా కళ్ళు చెదిరేటంత అందం ఆమెది. పెళ్ళిలో మహా చలాకీగా ఉంది. మాకు కులాలు కలిశాయి. వయసులు కలిశాయి. ఇక మనసులు కలవాలి.

పలకరించి అడిగేద్దామనుకున్నాను కానీ అద్దంలో నా ముఖం చూస్కోమంటే! అలాంటి అవమానం ఒకసారికి ఫరవాలేదు — కానీ రెండో సారి...

ఆశ వదులుకుందామా అంటే — ఆమె కళ్ళు ఎంత అందమైనవి. అందమైన కళ్ళు ముఖ సౌందర్యాన్ని చూడవు — హోదాను చూస్తాయని నా మరదలు చెప్పకనే చెప్పింది. నా హోదా తక్కువదేం కాదు.

అక్కడ నా స్నేహితుడొకడుంటే నా మనఃస్థితి చెప్పుకున్నాను. వాడు ఆశ్చర్యంగా, "ఆ పిల్ల నీకు అందంగా కనబడిందా?" అన్నాడు.

వాడూ ఓ పెళ్ళికొడుకే కానీ గుమాస్తా ఉద్యోగం. ఆఫీసరు సదుపాయాలతో జీవించాలని కోరిక. లంచం పుచ్చుకుంటే చట్ట విరుద్ధమని భయం. అందుకని అన్ని సదుపాయాలూ కట్నం ద్వారా పొందాలనుకుంటున్నాడు. వాడికి సంబంధాలు వస్తున్నాయి. బేరాలు కుదరడం లేదు. లత వాడికి అందంగా కనబడలేదంటే బహుశా ఆమెకు డబ్బుండి ఉండదు.

"నా కళ్ళతో చూడు" అందామనుకున్నాను. కానీ వాడికీ మరదలుంది. ఆ అనుభవంతో వాడు నా ముఖాన్ని అద్దంలో చూస్కోమనే తెలివి చూపిస్తాడని భయం వేసింది. ఏ దారీ లేనప్పుడు అమాయకంగా ముఖం పెట్టడం మంచిదని ఆ పనే చేసి, "ఏం? ఆమె అందంగా లేదా?" అన్నాను.

వాడు నిట్టూర్చి, "వెంటనే పెళ్ళి చేసేస్కో ఇక నువ్వు ఆలస్యం చేయడం మంచిది కాదు" అన్నాడు.

"నువ్వే నాకు సాయపడాలి" అన్నాను. వాడు నాకాపిల్ల అడ్రసు సంపాదించి యిచ్చాడు. చాలా మర్యాదగా ఆమెకో ప్రేమలేఖ వ్రాశాను. ఆమె నాకు నచ్చిందనీ, ఇష్టమైతే పెద్దలను సంప్రదించి పెళ్ళి చేసుకుంటాననీ స్పష్టం చేశాను. నా హోదాను సూచించే లెటర్ హెడ్ వాడాను.

ఉత్తరం వ్రాసిన నాలుగు రోజులకు నాకు లత నుంచి ఫోను వచ్చింది. అసలే తీయని గొంతు — ఫోన్లో మరింత సన్నబడి — అందంగా ధ్వనించింది.

"నేను ఆత్మగౌరవం గల ఆడపిల్లని. నన్ను గౌరవించే వాడినే పెళ్ళి చేసుకుంటాను. మీరు నన్ను చూశారు. నేను మిమ్మల్ని చూడలేదు. కాబట్టి మీ ఫోటో ఒకటి పంపించండి. నా అభిప్రాయం చెబుతాను".



లతతో ఇంకా మాట్లాడాలనుకున్నాను కానీ అవతల క్లిక్‌మంది. ఆమె మాటల సారాంశం మాత్రం నా బుర్రలో స్థిర నివాసం ఏర్పరచుకుంది. వెంటనే నా డ్రాయరు అరలోంచి ఫోటో ఆల్బం తీశాను. అందులో అన్ని పేజీలలోనూ నేనే — ఎన్నో పేజీల్లో ఉన్నాను. నన్ను నేను అందంగా మలచుకునేందుకు చేసిన వృథాప్రయత్నాలవన్నీ! వాటిలో ఏ ఫోటోని ఎన్నిక చేయాలా అని నా ఆలోచన.

"ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ది బెస్ట్ ఇంప్రెషన్" అంటారు. లత నా ఫోటో చూసి అదిరిపోవాలి.

ఆల్బమంతా తిరగేసినా ప్రతి ఫోటో నన్నే అదరగొడుతోంది. లతను అదరగొట్టే ఫోటో కనబడలేదు. తీసిన స్టూడియోలో తీయకుండా — వచ్చిన ఆ ఫోటోలు ఒక ఊరివి కూడా కాదు. కాబట్టి ఇప్పుడు నేను కొత్తగా ఫోటో తీయించుకోవాలంటే ఏ స్టూడియోలో అన్నది కాదు — ఏ ఊళ్ళో అన్నది కూడా సమస్యే!

నేనిలా సతమతమవుతుంటే నా గదిలో అడుగు పెట్టింది షీలా. నా ముందో ఫోటో ఉంచి, "కొత్తగా తీయించాను. పెళ్ళి చూపులకు పంపమంటావా? మీకు నచ్చితేనే బాగున్నట్లు!" అంది.

షీలాకు నన్ను పెళ్ళి చేసుకోవాలని ఉంది. ఏదో వంకపెట్టి నా దగ్గర పెళ్ళి ప్రసక్తి తెస్తుంది. ఆమె కళ్ళు కూడా నా మరదలంత అందమైనవి. కానీ ఏ వరసలోనూ ఆమె నాకు మరదలు కాదు. అదీ దురదృష్టం.

ఫోటో చూశాను. అద్భుతం! షీలా అందానికి మరిన్ని మెరుగులు దిద్దబడ్డాయందులో. క్షణంపాటు నా ఆలోచనల్ని షీలా ఆక్రమించేసింది. ఆ మైకంలోంచి బయటపడ్డానికి కాసేపు తంటాలు పడి ఏ స్టూడియోలో ఆమె ఆ ఫోటో తీయించుకున్నదీ తెలుసుకున్నాను.

నా ఆనందానికి అవధులు లేవు. అది కొత్త స్టూడియో — వచ్చి మూణ్ణెల్లయింది. ఎందుకో అది నా దృష్టికి రాలేదు. లేకుంటే ఈ పాటికే నాదీ ఓ ప్రయత్నమైపోయి ఉండేది.

స్టూడియో అందం!

సాయంత్రానికల్లా అక్కడకు వెళ్ళి — మేనేజర్ని కలుసుకుని సిగ్గువిడిచి నా అవసరాన్ని చెప్పుకుని — "నా ఫోటో చూసీ చూడగానే నా అంత అందగాడు లేడనిపించాలి" అన్నాను.

మేనేజరు నా వంక ఎగాదిగా చూసి, "అయితే అద్దంలో చూస్కోండి" అన్నాడు. ఆ డైలాగుకు నేను ప్రిపేరయే ఉన్నానేమో చాలా కోపం వచ్చేసింది. సీరియస్‌గా ముఖం పెట్టి చెడామడా తిట్టేశాను. మేనేజరు మాత్రం ఏమాత్రం చలించకుండా, "మీక్కోపమెందుకొచ్చిందో నాకు తెలియ

# బహుమతి పొందిన కథ

లేదు. మీ అవసరానికి తగ్గ సలహా ఇచ్చాను. ఆపైన మీ యిష్టం. మీ వంటి వారి కోసం ఇటీవలే మేము ఓపెన్ చేసిన కొత్త బ్రాంచి స్టూడియో అద్దం!'' అన్నాడు.

అద్దం అన్నది స్టూడియో పేరన్నమాట. అది తెలియగానే మేనేజరు డైలాగులు నెమరువేసుకుంటే స్ఫురించింది — అద్దంలో చూస్కోండి అనలేదతడు. తీస్కోండి అన్నాడు. నేనే అనుమానంతో భుజాలు తడుముకున్నాను.

''ఏమిటి అద్దం ప్రత్యేకత?'' అన్నాను.

''ఎవరిముఖమైనా అక్కడి కెమెరాలో ఏదో చిన్న మార్పు లేకుండా బయటపడదు'' అన్నాడు మేనేజరు.

''ఆ మార్పు ఉన్న అందాన్ని పోగొడితే!'' అనుమానంగా అడిగాను.

''ఆ భయం మీకు లేదు. ఎంత చిన్న మార్పయినా మీ అందాన్ని పెంచగలదే తప్ప దించలేదు'' అన్నాడు మేనేజరు నమ్మకంగా.

నా ముఖ సౌందర్యాన్ని ఎంత అందంగా నిర్వచించాడు? అందుకే స్టూడియో అందానికి అతడు మేనేజరయ్యాడు.

మరి మాట్లాడకుండా నేను స్టూడియో అద్దం చేరుకున్నాను. అక్కడ చాలా రష్‌గా వుంది. హడావిడిగా వుంది. నా ఛాన్సు రావడానికి చాలాసేపు పట్టింది. ఓపికగా ఎదురుచూశాను. ఈ దేశంలో నాలాటి వాళ్ళు మరీ యింతమంది ఉన్నారా అన్న ఆశ్చర్యానందాలు నాకు సమయం తెలియకుండా చేశాయి. కానీ ఆ వచ్చిన వాళ్ళలో నా కంటికి అందంగా కవబడ్డవాళ్ళు కాస్త ఎక్కువగానే ఉండడం నాకు కాస్త అసంతృప్తిగానే వుంది.

ఫొటోగ్రాఫరు ఫొటో తీసేముందు — ''ఈ చొక్కా బాగోలేదు. మీకు తగిన చొక్కా యిచ్చేదా?—'' అన్నాడు. ఏమో ఎందుకు చెప్పొద్దనవి సరేనన్నాను. ఓ కొత్త యిస్త్రీ చొక్కా యిచ్చాడు. తెల్లగా మెరిసిపోతున్న ఆ చొక్కా మీద హృదయాన్ని తాకే ప్రాంతంలో లవ్‌సింబల్ వుంది. ఫొటోగ్రాఫర్ నాపేరడిగి — ఆ సింబల్‌లో అందంగా వ్రాశాడు.

నేనా చొక్కా వేసుకుని ఫొటో తీయించుకున్నాను.

అక్కడ వారివారి అవసరాలను బట్టి చొక్కాలు మార్చి ఫొటోలు తీస్తారుట. ప్రేమికులకు లవ్‌సింబల్‌లో పేరు వ్రాస్తారుట. ఆ పేరును చెరిపివేయడం సులభమేనుట. ఫొటోగ్రాఫర్ నాకో స్లిప్ ఇచ్చాడు. అది చాలా ముఖ్యమన్నాడు.

సరిగ్గా మూడు రోజుల తర్వాత వెళ్ళాను. ఫొటోలు తీసుకుందుకు పెద్ద క్యూ. నా పొజిషన్ లెక్కపెడితే 52 అయింది. ఎంతసేపు పడుతుం దోనని కంగారు పడ్డాను. కానీ చాలామంది స్లిప్పులే లేదు. నా ఛాన్సు తొందరగానే వచ్చింది. స్లిప్పుకంత ప్రాముఖ్యత ఏమిటో అనుకుంటూ జేబులో చెయ్యిపెడితే స్లిప్పు తగలలేదు.

''పక్కకు తప్పుకోండి సార్! రేపు స్లిప్పయినా తెచ్చుకుని రండి. లేదా ఎనిమిదయ్యేదాకా ఆగండి. స్లిప్పులు లేని కేసులు అప్పుడే చూస్తాం'' అన్నాడు కౌంటర్లో వ్యక్తి.

వాదించే వ్యవధి లేదు. వెనకాల వాళ్ళు తొందర పెడుతున్నారు. టైము చూస్తే ఇంకా ఆరే అయింది. రేపటి దాకా [illegible] అందుకని ఎనిమిది దాకా వెయిట్ చేశాను. ఆశ్చర్యమేమిటంటే వెయిట్ చేస్తున్నది నేనొక్కడినే!

కౌంటర్లోని వ్యక్తి నన్ను పిలిచాడు. వెళ్ళాను. ఏ తేదీన ఫొటోలు తీయించుకున్నదీ అడిగి నాకో బాక్సు ఇచ్చాడు. అందులో మొత్తం వంభై తొమ్మిది చిన్న కవర్లున్నాయి. ఓపికగా ప్రతి కవరూ చూశాను. నా ఫొటో కవబడలేదు. చెప్పాను.

కౌంటర్ వ్యక్తి నవ్వి, ''మే ఐ హెల్ప్ యూ'' అన్నాడు. ఊ అని తలూపాను. అతగాడు నా పేరడిగి — చకచకా బాక్సులో వెతికి ఓ ఫొటో తీసిచ్చి — ''ఇదిగో మీ ఫొటో! లేదంటారేం?'' అన్నాడు.

''ఇది నా ఫొటో?'' అన్నాను ఆశ్చర్యంగా. ఆ ఫొటో నాదైతే నాకూ ఆనందమే. అందులోని వ్యక్తి సినీ హీరోలకంటే బాగున్నాడు. ఎంతో దాగా నవ్వుతున్నాడు. ఈ ఫొటో చూశాక నన్ను చూస్తే లత ఇష్టపడడం మాటటుంచి మోసగాడని అపార్థం చేసుకుంటుంది.

''చొక్కా మీద మీ పేరు చూస్కోండి'' అన్నాడు కౌంటరు వ్యక్తి.

ఆ పేరు నాదే — సందేహం లేదు. కానీ ఫొటోలోని శాల్తీ నేను కాదు. అదే ఆ మనిషికి నొక్కి చెప్పాను.

''ఏ రోజున ఫొటో తీయించుకున్నారో మీకు బాగా గుర్తుందా'' అనడిగాడతడు. ఉందన్నాను.

''ఆ రోజున ఈ పేరుతో ఇంకెవ్వరూ ఫొటో తీయించుకోలేదు. ఇది తప్పకుండా మీదే!'' అన్నాడా మనిషి నమ్మకంగా.

''ఇది చాలా బాగుంది. నా ఫొటో ఏదో నాకు తెలియదా?'' అన్నాను కాస్త చిరాగ్గా.

''ఇలాంటి గొడవలు లేకుండా ఉండాలనే స్లిప్‌లు తీసుకు రమ్మన్నాం. మరి మీరు తేకపోతిరి?!'' అన్నాడు కౌంటర్లోని వ్యక్తి తప్పంతా నామీదకే నెట్టేస్తూ. ఆ స్లిప్ ఎంత ముఖ్యమో నాకప్పుడర్థమయింది. అర్థంకాగానే అసలు సంగతి గుర్తుకొచ్చింది. పర్సులో దాచానా స్లిప్‌ని. నా అంతరాత్మకు దాని విలువ తెలిసిందేమో అనుకోకుండా అక్కడ దాచాను మరి! పర్సు తెరిచి స్లిప్ తీసి కౌంటర్ వ్యక్తికందించాను.




## అదే

''నీకా కడుపు రావడానికి కారణమెవరో చెప్పమ్మా? ఆయనతో నీ పెళ్ళి జరిపిస్తాను.''

''అదే నాకర్థం కావడం లేదు నాన్నా''.

—అంకాని రాము (ఓడలరేవు)






## ఎందుకో!?

ఘరానామొగుడు చిత్రంలో వానపాటలో అందాలను ఆరవేసిన వర్షసుందరి వాణీవిశ్వనాథ్‌కు, ఎక్స్‌పోజింగ్ గట్స్ వున్న నిరోషాకు, గ్లామర్ పాత్రలు వేయగలనంటోన్న యమునకు, బాపూ బొమ్మ దివ్యవాణిలకు సరైన అవకాశాలు రావడం లేదు. ఎందుకో మరి!

—విజయార్కె



"ముందే ఈ పని చేస్తే మీకూ మాకూ శ్రమ తప్పేది" అంటూ కౌంటర్లో మనిషి స్లిప్‌ని శ్రద్ధగా చూశాడు. తర్వాత నా చేతిలోని కవరందుకుని — "ఇంక మీరు కాదనడానికి లేదు. ఇదే మీ ఫోటో! స్లిప్పు నంబరు కూడా టాలీ అయింది" అన్నాడు.

ఎదురుగుండా చెట్టంత మనిషిని నేనుంటే — నా ఫోటోని స్లిప్పు నంబరుతో గుర్తు పడతాడేమిటీ

నేను మరికాస్త చిరాకు పడ్డాను. అప్పుడు స్టూడియోలోని స్టాఫంతా ఒకొక్కరే వచ్చి స్లిప్పునంబరు, నా పేరు, ఫోటో తీయించుకున్న తేదీ — అన్నీ టాలీ చేసి అది నా ఫోటోయేనని ధృవపరిచారు. ఒక్కరూ నా ముఖం చూడలేదు.

చివరకు విసిగిపోయి, "ఈ ఫోటో నాదని యిస్తే ఎవరైనా నన్ను మోసగాడని కోర్టుకూ్కడా ఈడ్వొచ్చు" అన్నాను.


కౌంటర్ వ్యక్తి గంభీరంగా నవ్వి, "అదా మీ భయం! మా స్టూడియోలో స్టాఫు ఇంత ఎక్కువున్నదెందుకని? అందులో ఫోటోగ్రాఫర్లు, టెక్నీషియన్లే కారు, లాయర్లు, రిటైర్డు న్యాయమూర్తులు కూడా ఉన్నారు. ఇక్కడ తీసుకున్న ఫోటో మీదేనని వారు హామీ ఇస్తారు. ఎవరైనా మిమ్మల్ని కోర్టు కీడ్చితే — వాళ్ళకు ఓటమి తప్పదు. హామీ పత్రానికి అదనంగా యాభై రూపాయలు చార్జి అవుతుంది. అంతే!" అన్నాడు.

"నేను బ్రతికే ఉన్నాను కదా! నా ఫోటోకు వేరే హామీ పత్రమెందుకు?" అన్నాను దుఃఖాన్నణచి పెట్టుకుంటూ.

"అవసరం లేదనుకుంటే తీసుకోకండి. మేము హామీపత్రం ఇవ్వడానికి సిద్దంగా ఉన్నాం. ఆ నమ్మకంతో మీరీ ఫోటోను తీసుకోవచ్చు. ఫోటోకు ఆరు నెలలు గ్యారంటీ ఉంటాం. మీ స్లిప్ నెంబర్ కోట్ చేస్తే చాలు. ఎన్ని ప్రింట్లయినా తీసివ్వగలం. హామీపత్రం కావాలనుకుంటే మాత్రం ఈ ఆర్నెల్లలోగానే అడగాలి. ఆ తర్వాత నెగెటివ్‌ని నాశనం చేసేస్తాం..." వివరించాడు కౌంటర్ వ్యక్తి.

"చాలా బాగుంది. ఇలాగైతే మీ స్టూడియోలో ఎవరైనా ఫోటోలు తీయించుకుంటారా?" అన్నాను.

కౌంటర్ వ్యక్తి నా వంక జాలిగా చూసి తన జేబులోంచి ఓ ఫోటోను తీసి నా ముందుంచి, "అంతా దేవుళ్ళవో, బాబాలవో ఫోటోలు జేబులో ఉంచుకుంటారు. మా యింట్లో అందరూ గొప్ప ఫోటోగ్రాఫర్లు. అంతా నన్ను ఎందుకూ పనికిరానివాడన్నారు. ఫోటోగ్రాఫర్‌గా పేరు తెచ్చుకోవాలని నా కోరిక. ఎవరో నా గురించి విని ఈయన ఫోటో తీయమన్నారు. ఎక్కడో ఉపన్యసిస్తూంటే తీశాను. ఇలా వచ్చింది. ఈ ప్రింటు చూసి ఒకాయన నా స్టుడియోకి ఫైనాన్సు చేశాడు. పెట్టి నాలుగు



అనుమానం

"ఏమండీ నాకెందుకో మన పనిమనిషి మీద అనుమానంగా ఉంది".

"ఏమిటో ఆ అనుమానము".

"నిన్నటినుండి నన్ను అక్కయ్యా అంటూ పిలుస్తుంది".

—పి.చంద్రారెడ్డి (కాచాపూర్)

వారాలయింది. బిజినెస్ ఉధృతం తట్టుకోలేకుండా ఉన్నాను... ఈయన నా పాలిటి దేవుడు" అన్నాడు.

కుతూహలంగా ఫోటోని చూశాను. మనిషి సన్నగా, పుల్లలా, దవడలు పీక్కుపోయి ఉన్నాడు. ఒత్తయిన ఉంగరాల జుత్తు...

"ఎవరీయన?" అనడిగాను.

"ఎవ్వరయితేనేం — ఈయన కారణంగానే దేశానికి నా స్టూడియో అవసరం వచ్చి నాకు వ్యాపారావకాశం కలిగింది. ఈ స్టూడియో ఉద్దేశ్యం ఏమైనా మీబోంట్లకు కూడా సాయం చేయగలుగుతున్నందుకు సంతోషంగా ఉంది. ఫోటో విషయంలో మిమ్మల్నెవరు తప్పు పట్టినా — ఒకే మాట చెప్పండి — అద్దం అబద్ధమాడదు అని!" అన్నాడు కౌంటర్ వ్యక్తి. అతడు నాముందున్న ఫోటోని తీసుకుని కళ్ళకద్దుకుని తిరిగి జేబులో ఉంచుకున్నాడు.

"ఆయనెవరో చెప్పకూడదా?" అన్నాను కుతూహలం చంపుకోలేక.

"ఆయన్నే గుర్తు పట్టలేదా? ప్రస్తుతం వార్తల్లో ప్రముఖ వ్యక్తి ఆయన..." ఆగాడు కౌంటర్ వ్యక్తి.

నా కుతూహలం పెరిగిందే కానీ సమస్య విడలేదు.

నేను మరీ వొక్కించడంతో, "అయ్యో! మన దేశపు ఎన్నికల ప్రధానాధికారి మీకు తెలియదా?" అన్నాడు కౌంటర్ వ్యక్తి.

అంతే!

నా ఫోటో అప్పుడు అచ్చం నా ఫోటోలాగే అనిపించింది. కనిపించింది.

"అద్దం అబద్ధమాడదు" అనుకుంటూ డబ్బు చెల్లించి అక్కణ్ణించి కదిలాను.

*

A.P లో 14 సం॥ నుండి
BEAUTY COURSE TRAINING
ఇస్తున్న ఏకైక సంస్థ

WOMAN'S WORLD
INTERNATONAL BEAUTY INSTITUTE
(SHAHNAZ HERBAL)
Eluru Road
VIJAYAWADA - 2
Phones : Res 432576 Off. 432487

COURSES OFFER
☆ DIPLOMA COURSE
☆ P. G. DIPLOMA COURSE
☆ TEACHER'S TRAINING COURSE

No Age Bar & No Qualification
We Offer New Courses.

1. Advanced Beauty Treatments
2. Cosmetology
3. Aroma Therapy
4. Permanent Cosmetic Make -Up (Tatto forTokyo Styles)
5. Hair Dressing, Hair Styling, Hair Cutting/ Setting
6. Ear Piercing
7. Thermalysis (blend) Permanent hair removing

Join Today and Become a Beautician of Tomorrow

The trainees of this institute are working in America, Africa, Ethiopea, Turkey, London

ANUPAMA
M.F.Phycs
I.T.E.C. Teachers Training (London)
Vaani Krishna